www.bhadradrinews.com

భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily

పాఠశాలల్లో డీఈఓ వాసంతి

ఆకస్మిక సందర్శన

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలపై ప్రత్యేక పరిశీలన

పదో తరగతి పరీక్షలకు వంద రోజుల ప్రణాళికతో సిద్ధం కావాలి



3

హైదరాబాద్ సంపుటి: 05 సంచిక: 291 బుధవారం 18-11-2026 ఎడిటర్ : చెంగపొంగు సైదులు పేజీలు: 05 వెల : 5

16 ఏళ్ల నిరీక్షణకు తెర..

హేమచంద్రాపురం రోడ్డు విస్తరణకు గ్రీన్‌సిగ్నల్!

రైల్వే భూముల అప్పగింత ప్రక్రియ పూర్తి

ఎంపీ రఘురామిరెడ్డి, ఎమ్మెల్యే కూనంనేని సమన్వయ కృషితో సమస్యకు పరిష్కారం

ఐదు ప్రధాన రహదారుల అభివృద్ధితో ఆధునిక నగరంగా కొత్తగూడెం: మేయర్ మూడ్ గణేష్

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 17 (భద్రాద్రి న్యూస్):

కొత్తగూడెం పట్టణ ప్రజలను దశాబ్దాలుగా వేధిస్తున్న ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కీలక ముందడుగు పడింది. సుమారు 15 నుంచి 16 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న హేమచంద్రాపురం రోడ్డు విస్తరణకు అవసరమైన రైల్వే భూముల అప్పగింత ప్రక్రియ పూర్తయింది. ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామిరెడ్డి ప్రత్యేక చొరవ, స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సమన్వయంతో ఈ సమస్య పరిష్కారానికి మార్గం సుగమమైంది. మంగళవారం కొత్తగూడెం రైల్వే స్టేషన్ వద్ద ఎంపీ సమక్షంలో రైల్వే అధికారులు మిగతా 3లో..





మంత్రి వర్సెస్ సెక్రటరీ!

కార్మిక శాఖలో మంత్రి, సెక్రెటరీ మధ్య కొరవడిన సమన్వయం

ఒకరి ఆదేశాలను మరొకరు పట్టించుకోవడం లేదన్న విమర్శలు

బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డులో అక్రమాల ఆరోపణలు

బినామీ దరఖాస్తులతో ఎక్స్‌గ్రేషియా నిధులు స్వాహా?

ధ్రువపత్రాలు లేకుండానే క్లెయిమ్స్‌కు అనుమతులు?

అక్రమాలపై విచారణకు మంత్రి ఆదేశాలు

విజిలెన్స్ విచారణ పరిధిపై సెక్రెటరీ జోక్యం?

రాష్ట్రవ్యాప్త విచారణను జిల్లా పరిధికే పరిమితం చేశారన్నప్రచారం

విచారణ పరిధిపై రెండుసార్లు సవరించిన జీవోలు?

శాఖల పనితీరు మెరుగుపడాలంటే మంత్రి, ఉన్నతాధికారుల మధ్య సమన్వయం కీలకం. కానీ కార్మిక శాఖలో మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయనే ప్రచారం జరుగుతోంది. మంత్రి, సెక్రెటరీ మధ్య విభేదాలు, ఆదేశాల అమలులో నిర్లక్ష్యం శాఖను వివాదాల్లోకి నెడుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. మరోవైపు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధుల చెల్లింపుల్లో అక్రమాలు జరిగాయనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ఈ వ్యవహారంపై విచారణ పరిధిని రాష్ట్రవ్యాప్తంగా కాకుండా పరిమితం చేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అసలు కార్మిక శాఖలో ఏం జరుగుతోంది? విచారణ పరిధి కుదింపు వెనుక కారణాలేంటి?

భద్రాద్రి న్యూస్ స్పెషల్ ఫోకస్

5

ప్రతి అర్హ కుటుంబానికి రూ.5 లక్షల బీమా భరోసా!

- ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం అమలుకు పకడ్బందీ చర్యలు
- వివరాల నమోదులో తప్పులకు తావివ్వొద్దు..



2

దశాబ్దాల ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం..

- రోడ్డు విస్తరణకు ఎంపీ చొరవ!
- ఎంపీ రఘురాంరెడ్డికి కొత్వాల ఆధ్వర్యంలో ఘన సన్మానం
- రైల్వే శాఖ నుంచి 20 అడుగుల స్థలం అప్పగింతకు అగ్రిమెంట్
- రోడ్డు విస్తరణ పనులకు మార్కింగ్ పూర్తి



2

మావోయిస్టు పి ఎల్ జి ఏ బెటాలియన్ డంపుల గుట్టురట్టు!



- మూడు రహస్య డంపుల నుంచి 280 బీజీఎల్ షెల్స్ స్వాధీనం
- లొంగిపోయిన మావోయిస్టుల సమాచారంతో పోలీసుల గాలింపు..
- తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అడవుల్లో గుర్తింపు

భద్రాచలం, నవంబర్ 17 (భద్రాద్రిన్యూస్):

నిషేధిత సీపీఐ మావోయిస్టు పార్టీకి చెందిన పి ఎల్ జి ఏ బెటాలియన్ రహస్య ఆయుధ డంపులను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు గుర్తించారు. తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర సరిహద్దులోని పూజారి కాంకేర్ గ్రామ సమీప అటవీ ప్రాంతంలో మూడు డంపులను వెలికితీసి, వాటి నుంచి మొత్తం 280 బీజీఎల్ (BGL) షెల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. లొంగిపోయిన మావోయిస్టులు అందించిన విశ్వసనీయ సమాచారం ఆధారంగా ఈ ఆపరేషన్ నిర్వహించారు.

మూడు డంపుల్లో దాచిన షెల్స్

ఈ నెల 16న లొంగిపోయిన మావోయిస్టులు అందించిన సమాచారంతో చర్ల పోలీసులు, స్పెషల్ పార్టీ సిబ్బంది, బాంబు డిస్పోజల్ (BD) బృందం సంయుక్తంగా అటవీ ప్రాంతంలో గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో సీపీఐ మావోయిస్టు పి ఎల్ జి ఏ బెటాలియన్‌కు చెందిన మూడు రహస్య డంపులను గుర్తించారు. ఒక్కో డంపులో సింథటిక్ వాటర్ ట్యాంక్ డ్రమ్‌ను అమర్చి అందులో బీజీఎల్ షెల్స్ దాచినట్లు గుర్తించారు. వాటిని బయటకు తీసి లెక్కించగా మొత్తం 280 షెల్స్ ఉన్నట్లు పోలీసులు నిర్ధారించారు.

భవిష్యత్తు అవసరాల కోసం నిల్వ

2025 సంవత్సరం ప్రారంభంలో పి ఎల్ జి ఏ బెటాలియన్

దశాబ్దాల ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం..

- రోడ్డు విస్తరణకు ఎంపీ చొరవ!
- ఎంపీ రఘురాంరెడ్డికి కొత్వాల ఆధ్వర్యంలో ఘన సన్మానం
- రైల్వే శాఖ నుంచి 20 అడుగుల స్థలం అప్పగింతకు అగ్రిమెంట్
- రోడ్డు విస్తరణ పనులకు మార్కింగ్ పూర్తి

కొత్తగూడెం ,నవంబర్ 17 (భద్రాద్రిన్యూస్):-



పట్టణంలోని హేమచంద్రపురం రహదారిపై దశాబ్దాలుగా నెలకొన్న ట్రాఫిక్ సమస్యకు రోడ్డు విస్తరణ ద్వారా పరిష్కారం చూపే దిశగా చొరవ తీసుకున్న ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డిని డిసీఎంఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్కెఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు.

మంగళవారం కొత్తగూడెం రైల్వే స్టేషన్ సమీపంలో నిర్వహించిన కార్యక్రమంలో రైల్వే అధికారులు రోడ్డు విస్తరణకు సంబంధించిన 20 అడుగుల స్థలానికి సంబంధించిన అగ్రిమెంట్ పత్రాలను ఎంపీ రఘురాంరెడ్డికి అందజేశారు. అనంతరం రోడ్డు విస్తరణకు సంబంధించి స్థలాన్ని మార్కింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీతో పాటు కొత్వాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దశాబ్దాలుగా పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ ఇబ్బందులకు పరిష్కారం దిశగా రోడ్డు విస్తరణకు మార్గం సుగమం కావడంతో కాంగ్రెస్ నాయకులు ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, వివిధ హోదాల్లో ఉన్న కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.





ప్రతి అర్హా కుటుంబానికి రూ.5 లక్షల బీమా భరోసా!

- ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం అమలుకు పకడ్బందీ చర్యలు
- వివరాల నమోదులో తప్పులకు తావివ్వొద్దు.. అధికారులకు అదనపు కలెక్టర్ విద్యా చందన ఆదేశం
- పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లకు ప్రత్యేక శిక్షణ

కొత్తగూడెం, నవంబర్ 17 (భద్రాద్రిన్యూస్):

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని జిల్లాలో విజయవంతంగా అమలు చేసేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా పరిహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. పథకం అమలులో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా లబ్ధిదారుల వివరాలను ఖచ్చితంగా సేకరించి నమోదు చేయాలని సూచించారు.

ఇందులో భాగంగా మంగళవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) సమావేశ మందిరంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విద్యా చందనతో పాటు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి నాగలక్ష్మి, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి జె. సునీత పాల్గొన్నారు.

ఈ సందర్భంగా విద్యా చందన మాట్లాడుతూ, కుటుంబానికి ప్రధాన జీవనాధారంగా ఉన్న సంపాదనపరుడు అనుకోని పరిస్థితుల్లో మరణిస్తే ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా రూ.5 లక్షల జీవిత బీమా పరిహారం అందించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. పథక మార్గదర్శకాల ప్రకారం అర్హులను గుర్తించాలని, కులం, ఆదాయం, ఏపీఎల్, బీపీఎల్ వంటి అంశాలతో సంబంధం లేకుండా నిర్దేశిత అర్హతల ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని సూచించారు. బీమా పొందే వ్యక్తి వయస్సు 18 నుంచి 59 సంవత్సరాల మధ్య ఉండాలని వివరించారు.

వివరాల నమోదులో అప్రమత్తత అవసరం

పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లు పథకం మార్గదర్శకాలపై పూర్తి అవగాహన పెంచుకొని బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఆధార్, మొబైల్ నంబర్, కుటుంబ సభ్యులు, నామినీల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. నామినీ మైనర్ అయితే సంరక్షకుడి వివరాలను కూడా తప్పనిసరిగా పొందుపరచాలని తెలిపారు. దరఖాస్తులోని వివరాలను బీమాదారుడికి చదివి వినిపించి, సరిచూసిన అనంతరం సంతకం తీసుకోవాలని స్పష్టం చేశారు.

గ్రామస్థాయిలో ప్రత్యేక శిబిరాలు

గ్రామాల్లో నిర్వహించే శిబిరాల్లో కంప్యూటర్లు, ప్రింటర్లు, ఇంటర్నెట్‌తో పాటు టెంట్లు, కుర్చీలు, తాగునీరు, మైక్ వంటి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దరఖాస్తుదారులకు సహాయం అందించేందుకు ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేయాలని, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, మార్గనిర్దేశం చేసే సిబ్బందిని అందుబాటులో ఉంచాలని తెలిపారు. వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని సూచించారు.

రేషన్ కార్డుల ఆధారంగా అందుబాటులో ఉన్న ముందస్తు సమాచారాన్ని ఉపయోగించి దరఖాస్తులు నింపాలని, రేషన్ కార్డులు లేని కుటుంబాల వివరాలను ప్రత్యేక దరఖాస్తుల ద్వారా సేకరించాలని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా లక్ష్యాలను పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.



ఆన్‌లైన్ నమోదు ప్రక్రియపై అవగాహన

ఈడీఎం సైదేశ్వరరావు ఆన్‌లైన్ దరఖాస్తు నమోదు ప్రక్రియను ప్రత్యక్షంగా వివరించారు. నమూనా దరఖాస్తు ద్వారా ముందస్తుగా నమోదైన వివరాల పరిశీలన, బీమాదారుడు, నామినీల వివరాల నమోదు విధానాన్ని ప్రదర్శించారు. నమోదైన దరఖాస్తులను స్కాన్ చేసి సంబంధిత బీమా సంస్థకు పంపించాలని, అసలు దరఖాస్తులను ఎంపీడీవో కార్యాలయంలో భద్రపరచాలని సూచించారు.

ఈ శిక్షణ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, జిల్లా వ్యాప్తంగా ఉన్న పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.



మావోయిస్టు పి ఎల్ జి ఏ బెటాలియన్ డంపుల గుట్టురట్టు!

మొదటిపేజీ తరువాయి

వికేంద్రీకరణ జరిగిన సమయంలో ఆ బెటాలియన్‌లోని మొదటి కంపెనీకి చెందిన ఈ షెల్స్‌ను అటవీ ప్రాంతంలో రహస్యంగా దాచిపెట్టినట్లు పోలీసులు గుర్తించారు. దట్టమైన అటవీ ప్రాంతం సురక్షితమని భావించిన మావోయిస్టులు భవిష్యత్తులో అవసరమైనప్పుడు వినియోగించుకునే ఉద్దేశంతో వీటిని నిల్వ చేసినట్లు పోలీసుల ప్రకటనలో పేర్కొన్నారు.

లొంగుబాటుతో డంపుల సమాచారం వెలుగులోకి

2025 చివరి భాగం నుంచి 2026 ప్రారంభం వరకు పలువురు మావోయిస్టులు తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న లొంగుబాటు, పునరావాస విధానం ద్వారా వారికి అవసరమైన సదుపాయాలు కల్పిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. లొంగిపోయిన వారికి నగదు రివార్డులు, ఇంటి స్థలం, వ్యవసాయ భూమి, స్వయం ఉపాధి కోసం బ్యాంకు రుణాలు, ఆరోగ్య కార్డులు అందిస్తున్నట్లు వెల్లడించారు. ఆసక్తి ఉన్నవారికి వారు ఎంచుకున్న రంగాల్లో నైపుణ్య శిక్షణ కూడా కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వం అందిస్తున్న పునరావాస సదుపాయాల పట్ల ఆకర్షితులైన మాజీ మావోయిస్టులు పార్టీ రహస్యంగా దాచిన డంపుల సమాచారాన్ని పోలీసులకు అందిస్తున్నారని తెలిపారు.

జనజీవన స్రవంతిలోకి రావాలని పిలుపు

ముప్పాల లక్ష్మణరావు అలియాస్ గణపతితో పాటు మరికొందరు మావోయిస్టులు ఇంకా అజ్ఞాతంలో ఉన్నారని పోలీసులు పేర్కొన్నారు. వారు ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలోకి రావాలని తెలంగాణ పోలీస్ శాఖ పిలుపునిచ్చింది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ప్రజాస్వామ్య జీవన విధానంలోకి వచ్చి తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరింది.



సర్వజ్ఞ స్కూల్ విజయదుందుభి: టేబుల్ టెన్నిస్ పోటీల్లో గోల్డ్ మెడల్స్ కైవసం

ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 17 (భద్రాద్రిన్యూస్):

చంద్రకళ మెమోరియల్ ఓపెన్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ 2026 రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌లో సర్వజ్ఞ స్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచారు. వేర్వేరు విభాగాల్లో పోటీపడిన విద్యార్థులు బహుముఖ ప్రతిభను చాటుతూ బంగారు పతకాలను (Gold Medals) కైవసం చేసుకున్నారు.

విజేతల వివరాలు: అండర్ 14 విభాగం: హరి , అండర్ 14 విభాగం: చార్విక్ , అండర్ 17 విభాగం: పజల్ , అండర్ 17 విభాగం: తరుణ్

ఈ ఘన విజయంపై పాఠశాల ఛైర్మన్ ఆర్.వి. నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ, "చదువుతో పాటు క్రీడల్లోనూ సర్వజ్ఞ విద్యార్థులు ఎప్పుడూ ముందంజలో ఉంటారు. క్రమశిక్షణ, నిరంతర సాధనతోనే ఈ విజయం సాధ్యమైంది. భవిష్యత్తులో ఈ విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని పతకాలు సాధించి స్కూల్‌కు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నాను," అని తెలిపారు.

పాఠశాల డైరెక్టర్ కె. నీలిమ మాట్లాడుతూ, "మా పాఠశాల విద్యార్థులు టేబుల్ టెన్నిస్ విభాగంలో మొదటి స్థానం సాధించడం చాలా గర్వకారణంగా ఉంది. విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసి, వారిని క్రీడల వైపు ప్రోత్సహించడంలో మా వ్యాయామ ఉపాధ్యాయుల కృషి అభినందనీయం. విజయం సాధించిన విద్యార్థులందరికీ నా హృదయపూర్వక అభినందనలు," అని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా బంగారం పతకాలు సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది మరియు విద్యార్థులు ఘనంగా అభినందించి, శుభాకాంక్షలు తెలియజేశారు.



16 ఏళ్ల నిరీక్షణకు తెర..

మొదటిపేజీ తరువాయి

భూముల అప్పగింత కార్యక్రమాన్ని నిర్వహించారు.

5,500 చదరపు గజాల రైల్వే భూమి అప్పగింత

హేమచంద్రాపురం రోడ్డు విస్తరణ కోసం కొత్తగూడెంలో రైల్వే శాఖకు చెందిన సుమారు 5,500 చదరపు గజాల భూమిని రెవెన్యూ శాఖకు అప్పగిస్తున్నట్లు ఎంపీ రఘురామిరెడ్డి వెల్లడించారు. దీనికి ప్రతిగా ఖమ్మం పట్టణంలో రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన సుమారు 4,500 చదరపు గజాల భూమిని రైల్వే శాఖకు బదిలీ చేయనున్నట్లు తెలిపారు. ఇరు ప్రాంతాల్లో భూముల మార్కెట్ విలువలను నిర్ధారించి, అవసరమైన ప్రభుత్వ అనుమతులు, ఉత్తర్వుల ప్రక్రియను పూర్తి చేసినట్లు వివరించారు.

ప్రజల సమస్యను పరిష్కరించడమే లక్ష్యం

ఎంపీగా ఎన్నికైన అనంతరం తొలిసారి కొత్తగూడెం పర్యటనకు వచ్చినప్పుడు స్థానిక ప్రజలు హేమచంద్రాపురం రోడ్డు విస్తరణ సమస్యను తన దృష్టికి తీసుకువచ్చారని రఘురామిరెడ్డి తెలిపారు. ప్రజలు, వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి ఈ సమస్య పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. అప్పటి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ భూముల సర్వే, మార్కెట్ విలువల నిర్ధారణ, ప్రతిపాదనల రూపకల్పనలో కీలక సహకారం అందించారని పేర్కొన్నారు.

దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌తో చర్చలు జరిపి సమస్యను వివరించడంతో రైల్వే శాఖ భూముల మార్పిడికి అంగీకరించిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి సమస్యను వివరించగా సానుకూలంగా స్పందించి ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. ఢిల్లీలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి విజ్ఞప్తి చేయడంతో భూముల మార్పిడి ప్రక్రియకు సహకారం అందిందన్నారు. ఈ ప్రక్రియ



లో సహకరించిన రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర రైల్వే శాఖ, దక్షిణ మధ్య రైల్వే అధికారులు, జిల్లా యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఐదు ప్రధాన రహదారుల అభివృద్ధికి ప్రణాళికలు

మేయర్ మూడ గణేష్ మాట్లాడుతూ హేమచంద్రాపురం రోడ్డు విస్తరణ కొత్తగూడెం ప్రజల చిరకాల ఆకాంక్ష అని, భూముల సమస్య పరిష్కారం కావడం సంతోషకరమని అన్నారు. త్వరలో రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించేందుకు మున్సిపల్ కార్పొరేషన్ తరఫున చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ, రహదారుల సుందరీకరణ, ఆధునిక లైటింగ్ ఏర్పాటుకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే సుమారు కోటి రూపాయలతో సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టినట్లు వివరించారు.

రైల్వే లైన్‌కు ఈ వైపున ఉన్న ఐదు ప్రధాన రహదారులను అభివృద్ధి చేసి కొత్తగూడెంను ఆధునిక పట్టణంగా, ప్రధాన వ్యాపార కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. సూర్య ప్యాలెస్ నుంచి ఎస్పీ కార్యాలయం వరకు, గణేష్ టెంపుల్ నుంచి ప్రగతి వన్ నగర్ వరకు రహదారుల విస్తరణ, ఆధునిక లైటింగ్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. అవసరమైన నిధుల సమీకరణకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రైల్వే స్టేషన్ పేరు మార్పునకు ప్రయత్నాలు

కొత్తగూడెం పట్టణానికి మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా రోడ్ల విస్తరణ, సెంట్రల్ లైటింగ్, ట్రాఫిక్ నియంత్రణ, పట్టణ సుందరీకరణకు ప్రాధాన్యత ఇస్తామని మేయర్ తెలిపారు. భద్రాచలం రోడ్ రైల్వే స్టేషన్ పేరును కొత్తగూడెంగా మార్చేందుకు కూడా ప్రయత్నాలు కొనసాగుతున్నాయని వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, కొత్తగూడెం ఆర్డీఓ మధు, తహసీల్దార్ పుల్లయ్య, రైల్వే రీజినల్ ఇంజనీర్ శశాంక్, డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ప్రసన్న కుమారి, సీపీఐ జిల్లా నాయకులు సబీర్ పాషా, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, రైల్వే, రెవెన్యూ శాఖల అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

పాఠశాలల్లో డీఈఓ వాసంతి ఆకస్మిక సందర్శన

- **విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలపై ప్రత్యేక పరిశీలన**
- **పదో తరగతి పరీక్షలకు వంద రోజుల ప్రణాళికతో సిద్ధం కావాలి**
- **నాణ్యమైన విద్య, ఉత్తమ ఫలితాలే లక్ష్యం**

ఖమ్మం ప్రతినిధి , నవంబర్ 17 (భద్రాద్రిన్యూస్):

విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించడంతో పాటు పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి డి. వాసంతి సూచించారు. మంగళవారం వైరా మండలంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, సీపీఎస్ (గుట్ట బడి) పాఠశాలలను ఆమె సందర్శించి విద్యార్థుల అభ్యసన స్థాయిలను పరిశీలించారు.

ఎఫ్ఎల్ఎన్ (ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞానం) కార్యక్రమంలో భాగంగా ముందుగా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి గణిత బోధనను పరిశీలించారు. విద్యార్థుల సంఖ్యా పరిజ్ఞానం, గణిత సామర్థ్యాలు, సమస్యలను పరిష్కరించే నైపుణ్యాలను సమీక్షించారు. గణిత అంశాలు సులభంగా అర్థమయ్యేలా వినూత్న బోధనా పద్ధతులు, బోధనాభ్యసన సామగ్రిని వినియోగించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

అనంతరం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి భౌతికశాస్త్ర బోధనను పరిశీలించి విద్యార్థుల విషయ పరిజ్ఞానం, అవగాహన స్థాయిలను సమీక్షించారు. పాఠశాలలోని ఏఐఎక్స్ఎల్ ల్యాబ్‌లను సందర్శించి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, డిజిటల్ అభ్యసనానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

వంద రోజుల ప్రణాళికతో పరీక్షలకు సిద్ధం కావాలి

పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులతో డీఈఓ ప్రత్యేకంగా మాట్లాడారు. పరీక్షలకు మిగిలిన వంద రోజుల సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రోజువారీ చదువుకు సమయపాలన పాటించడం, పాఠ్యాంశాలను నిరంతరం పునశ్చరణ చేయడం, గత సంవత్సరాల ప్రశ్నపత్రాలను సాధన చేయడం, నమూనా పరీక్షలు రాయడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. క్రమశిక్షణ, నిరంతర సాధన, ఆత్మవిశ్వాసంతో లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదవాలని, ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా పరీక్షలను ఎదుర్కోవాలని విద్యార్థులను ప్రోత్సహించారు.

గుట్ట బడి నిర్వహణపై ప్రశంసలు

అనంతరం సీపీఎస్ (గుట్ట బడి) పాఠశాలను సందర్శించి రెండో తరగతి బోధనను స్వయంగా పరిశీలించారు. ఉపాధ్యాయురాలు శైలజ బోధనా పద్ధతుల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల నిర్వహణ, విద్యాబోధన, ఇతర కార్యకలాపాలు చక్కగా నిర్వహిస్తున్నారని అభినందించారు.

ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థుల్లో చదవడం, రాయడం, గణితానికి సంబంధించిన ప్రాథమిక నైపుణ్యాలను పటిష్టం చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థి నిర్దేశిత అభ్యసన సామర్థ్యాలను సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి చావా శ్రీనివాసరావు, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వప్న, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మల్లేశ్వరి, గుట్ట బడి ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసచారి, కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్ పెనుగొండ ఉపేంద్రరావు, సీసీ మాధవరావు, జిల్లా ఎఫ్ఎల్ఎన్ బృంద సభ్యులు శ్రవణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థుల అభ్యసన ప్రమాణాల పెంపు, పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధన, నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా పాఠశాలల పర్యవేక్షణ నిరంతరం కొనసాగుతుందని అధికారులు తెలిపారు.





రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలలో స్వర్ణ పతకం సాధించిన 'హార్వెస్ట్' విద్యార్థి

ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 17 (భద్రాద్రిన్యూస్):-

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్.జి.ఎఫ్) వారి ఆధ్వర్యంలో సంగారెడ్డి లో ఈనెల 13 నుండి 15 వరకు నిర్వహించిన అండర్ 14 రాష్ట్రస్థాయి బాల బాలికల వాలీబాల్ పోటీలలో హార్వెస్ట్ పాఠశాల విద్యార్థి దేవిడ్ చనన్ (7వ తరగతి) ఖమ్మం జిల్లాజట్టులో పాల్గొని ఖమ్మం జిల్లా జట్టు రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలవడంలో తనవంతు పాత్రను విజయవంతంగా నిర్వహించి గోల్డ్ మెడల్ను సాధించినట్లు హార్వెస్ట్ విద్యాసంస్థల యాజమాన్యం తెలియజేశారు.

ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పి. రవిమారుత్ గారు, ప్రిన్సిపల్ ఆర్. పార్వతి రెడ్డి గారు మాట్లాడుతూ తమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థి దేవిడ్ చనన్ (7వ తరగతి) ఎస్.జి. ఎఫ్ రాష్ట్రస్థాయి టోర్నమెంట్లో గోల్డ్ మెడల్ సాధందించడం తమకు గర్వకారణమన్నారు. అదేవిధంగా క్రీడలు శారీరక, మానసిక వికాసానికి ఎంతగానో తోడ్పడతాయని, తమ విద్యాసంస్థలలో క్రమం తప్పకుండా క్రీడా తరగతులను ప్రతీరోజు నిర్వహిస్తున్నామని, ఒత్తిడిని తగ్గించేందుకు ఎంతగానో తోడ్పడతాయని అన్నారు. వీరికి ప్రత్యేక శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులను కొనియాడారు.



తల్లాడ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్

ఖమ్మం ప్రతినిధి ,నవంబర్ 17 (భద్రాద్రిన్యూస్):-

తల్లాడ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించిన పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పోలీస్ స్టేషన్ నిర్వహణ, స్టేషన్‌లోని రికార్డులు, పెండింగ్ కేసుల వివరాలు, కేసుల దర్యాప్తు పురోగతిని పరిశీలించారు.

పోలీస్ స్టేషన్ పరిసరాలను, సిబ్బంది పనితీరును పరిశీలించిన కమిషనర్, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించాలని అధికారులకు సూచించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, నేర నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. స్టేషన్‌కు వచ్చే బాధితులు, ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని పోలీస్ కమిషనర్ ఆదేశించారు. ఈ సందర్భంగా సెక్టర్ అధికారులు, పోలీస్ సిబ్బందితో మాట్లాడారు.

క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ సిస్టమ్స్ లో వస్తున్న అధునాతన పద్ధతులను అందిపుచ్చుకోవాలాని సిబ్బందికి సూచించారు. పోలీస్ స్టేషన్లలో డేటా నమోదు, దర్యాప్తు ప్రక్రియలో పారదర్శకత, సాంకేతికతను మెరుగుపరచడంలో ఈ వ్యవస్థ అత్యంత కీలకమని స్పష్టం చేశారు. జిల్లాలో వివిధ రకాల నేరాలకు పాల్పడుతున్న వారిని కనిపెట్టేందుకు ఈ ప్రాజెక్టులో నూతన పద్ధతులు ప్రవేశపెడుతున్నారని , వాటిపై పరిణితి సాధించాలని సూచించారు. ఉన్నతాధికారులు ప్రాజెక్టును సమర్థవంతంగా ఉపయోగించాలని..... తద్వారా క్రింది స్థాయి సిబ్బంది మరింత మెరుగ్గా విని యోగించేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రాజెక్టులో భాగంగా ఈసమన్స్, ఈసాక్ష్యా వంటి వాటిని విస్తృతంగా ఉపయోగించాలని వివరించారు. రౌడీ షీటర్ల ను కౌన్సిలింగ్ చేయాలని, అదేవిదంగా నిఘా పెట్టాలని ఆదేశించారు.









తల్లిదండ్రుల త్యాగానికి పాదాభివందనం..

- **విద్యార్థుల ప్రతిభకు త్రివేణి పట్టాభిషేకం***

ఖమ్మం ప్రతినిధి ,నవంబర్ 17 (భద్రాద్రిన్యూస్):-

పదో తరగతి విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, ఏకాగ్రత, లక్ష్యసాధనను పెంపొందించే ఉద్దేశంతో త్రివేణి పాఠశాల ఆధ్వర్యంలో ఖమ్మంలోని సూర్యతేజ ఏసీ ఫంక్షన్ హాల్‌లో ప్రత్యేక మోటివేషనల్ సెషన్ నిర్వహించారు. ఖమ్మం, సత్తుపల్లి శాఖల విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమానికి ప్రముఖ సైకాలజిస్ట్, బిహేవియరల్ స్కిల్స్ ట్రైనర్ డా. సంద్ర సుధీర్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు ప్రేరణాత్మక సందేశాన్ని అందించారు.

ఈ సందర్భంగా డైరెక్టర్ డా. గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ "త్రివేణి విద్యార్థులు ర్యాంకర్లే కాదు.. గుణాల బ్యాంకర్లు" అని పేర్కొంటూ, క్రమశిక్షణ, పట్టుదల, సమయపాలనతో లక్ష్యాలను సాధించాలని సూచించారు.

అనంతరం 580-595 మార్కులు సాధించిన 24 మంది ప్రతిభావంతులైన విద్యార్థులను మెమెంటోలతో సత్కరించగా, వారి తల్లిదండ్రులను పూలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తల్లిదండ్రుల పాదాల వద్ద పూలు సమర్పించి కృతజ్ఞతలు తెలియజేయడం కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఈ కార్యక్రమంలో త్రివేణి స్కూల్స్ సీఏసీ డా. ఎల్. నటరాజ్, డైరెక్టర్ వై. వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్ పి. రాజేంద్ర ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్స్ స్వప్న, ముస్తఫా, కోర్ టీమ్ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు

పేదరికం చదువుకు అడ్డు కాదు, పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదు..!

జమ్మికుంట, నవంబర్ 17, (భద్రాద్రిన్యూస్



పేదరికం చదువుకు అడ్డుకాదని, ఆర్థిక ఇబ్బందులు విజయానికి అపరోధం కావని నిరూపించారు జమ్మికుంటకు చెందిన హోంగార్డు ఎస్.కె. గౌస్. సాధారణ హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ వచ్చే పరిమిత ఆదాయంతో కుటుంబాన్ని పోషిస్తూనే,తన ముగ్గురు పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు ఆయన చేసిన కృషి నేడు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. ఒకే కుటుంబంలో ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు వైద్య విద్యలో రాణిస్తుండటం విశేషం.కరీంనగర్ జిల్లా జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ఆబాది జమ్మికుంటకు చెందిన ఎస్.కె.గౌస్ పోలీస్ శాఖలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నారు.సాధారణ ఉద్యోగం, పరిమిత ఆదాయం ఉన్నప్పటికీ పిల్లల చదువుల విషయంలో ఆయన ఎప్పుడూ రాజీపడలేదు. ఎన్నో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటూ, తన వ్యక్తిగత అవసరాలను పక్కనపెట్టి పిల్లల భవిష్యత్తుకు ప్రాధాన్యతనిచ్చారు.వారి ఉన్నత చదువుల కోసం ఎన్నో త్యాగాలు చేస్తూ నిరంతరం ప్రోత్సహించారు. గౌస్ పెద్ద కుమార్తె ఎస్.కె. హజారా కాకతీయ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ విద్యను పూర్తి చేసింది. రెండో కుమార్తె ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతోంది. ఇక కుటుంబంలో ఒక్కగానొక్క కుమారుడు నవాజ్ అలీకి నిజామాబాద్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు లభించింది. దీంతో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు పిల్లలు వైద్య విద్యలో ముందుకు సాగుతుండటం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.సంపద,ఆర్థిక స్థోమత ఉంటేనే ఉన్నత లక్ష్యాలను చేరుకోగలమనే అపోహను గౌస్ కుటుంబం చెరిపివేసింది.తండ్రి కష్టం, పట్టుదల, పిల్లల చదువుపై ఉన్న నమ్మకం.. పిల్లల ప్రతిభ,కృషి కలిస్తే ఎలాంటి పరిస్థితులనైనా అధిగమించవచ్చని నిరూపించింది.ముఖ్యంగా ఆర్థిక ఇబ్బందులతో ఉన్నత చదువులకు దూరమవుతున్న విద్యార్థులకు, తమ పిల్లలను చదివించాలని ఆశ పడుతున్న పేద,మధ్యతరగతి తల్లిదండ్రులకు ఎస్.కె. గౌస్ కుటుంబం ఆదర్శంగా నిలుస్తోంది. హోంగార్డుగా బాధ్యతలు నిర్వర్తిస్తూనే తన పిల్లల వైద్య విద్య కలను సాకారం చేస్తున్న గౌస్ కృషి అభినందనీయం. పిల్లల విజయమే తల్లిదండ్రుల జీవితానికి అసలైన సంపద అని ఈ కుటుంబం మరోసారి చాటిచెప్పింది.

చారుగుళ్ల డిస్కాన్‌లో ఇల్లందు వాసవి క్లబ్‌ల అవార్డుల సందడి!

- **వాసవి క్లబ్, వనిత క్రౌన్‌కు పలు ప్రతిష్టాత్మక పురస్కారాలు**
- **సూపర్ బెస్ట్ క్లబ్, జోన్ చైర్మన్, ప్రెసిడెంట్, సెక్రటరీ అవార్డులు కైవసం**
- **సేవా కార్యక్రమాలు, సమష్టి కృషికి దక్కిన గుర్తింపు**

ఇల్లందు, నవంబర్ 17 (భద్రాద్రిన్యూస్):

వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ V106A ఆధ్వర్యంలో భద్రాచలంలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి డిస్ట్రిక్ట్ కాన్ఫరెన్స్ (చారుగుళ్ల డిస్కాన్) లో ఇల్లందు వాసవి క్లబ్, వనిత క్రౌన్ పలు ప్రతిష్టాత్మక అవార్డులను సొంతం చేసుకున్నాయి. వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి సూపర్ బెస్ట్ అవార్డులతో పాటు పలు ప్రత్యేక పురస్కారాలను అందుకున్నాయి.

ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని సుమారు 50 క్లబ్‌లకు చెందిన ఐఈసీ, ఐపీసీ సభ్యులు, రీజినల్ సెక్రటరీలు, జోన్ చైర్మన్లు, క్లబ్ అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ముఖ్య అతిథిగా ఇంటర్నేషనల్ సెక్రటరీ (సర్వీసెస్) వీఎన్ సేవా సంకల్ప్ కేజీసీఎఫ్ జూలూరు రమేష్ బాబు, డిస్కాన్ అబ్జర్వర్‌గా ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ వీఎన్ డైమండ్ కేజీసీఎఫ్ విట్టా దురయ్య పాల్గొన్నారు.

ముఖ్య అతిథి వాసవి మాత పతాకాన్ని ఆవిష్కరించగా, జిల్లా ప్రథమ మహిళ చారుగుళ్ల వాణి సీతారత్నకుమారి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వాసవి మాత ప్రతిజ్ఞ నిర్వహించారు.

ఇల్లందు క్లబ్‌లకు అవార్డుల పంట

వాసవి సేవా పురస్కారాల ప్రదానోత్సవంలో ఇల్లందు క్లబ్‌లకు పలు అవార్డులు లభించాయి. బోనగిరి రవి కిరణ్: సూపర్ బెస్ట్ జోన్ చైర్మన్ అవార్డు.

కటకం అలేఖ్య: సూపర్ బెస్ట్ ప్రెసిడెంట్, బెస్ట్ డ్రెస్డ్, ఎర్లీ బర్డ్ అవార్డులు.

కటకం సత్యేంద్ర కుమార్: బెస్ట్ ప్రెసిడెంట్ అవార్డు.

తీర్దాల నాగరాజు: సూపర్ బెస్ట్ సెక్రటరీ అవార్డు.

వనిత క్రౌన్ ఇల్లందు: సూపర్ బెస్ట్ క్లబ్ అవార్డు.

వాసవి క్లబ్ ఇల్లందు, వనిత క్రౌన్ ఇల్లందు: గవర్నర్ విజిట్ అప్రిసియేషన్ అవార్డులు.

ఇల్లందు క్లబ్‌లు: బెస్ట్ మినిట్స్ బుక్, బెస్ట్ ఆల్బమ్ బుక్ అవార్డులు.

సేవా కార్యక్రమాలకు దక్కిన గౌరవం

ఇల్లందు వాసవి క్లబ్, వనిత క్రౌన్ సభ్యులు నిర్వహిస్తున్న నిరంతర సేవా కార్యక్రమాలు, సమష్టి కృషి, అంకితభావం, సమర్థవంతమైన నాయకత్వానికి ఈ అవార్డులు గుర్తింపుగా నిలిచాయని నిర్వాహకులు పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి సమాజానికి సేవలందిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఇల్లందు నుంచి డిస్ట్రిక్ట్ V106A క్యాబినెట్ జాయింట్ సెక్రటరీ పుల్లూరు సతీష్ కుమార్, చంద్రుపట్ల రోషయ్య, డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు యెలుగురి మధుబాబు, సైఫా రాజశేఖర్, జోన్ చైర్మన్ బోనగిరి రవి కిరణ్, వాసవి క్లబ్ అధ్యక్షులు కటకం సత్యేంద్ర కుమార్, వనిత క్రౌన్ అధ్యక్షురాలు కటకం అలేఖ్య, వాసవి క్లబ్ ప్రధాన కార్యదర్శి తీర్దాల నాగరాజు, ఆర్య వైశ్య కార్పొరేషన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మాజీ ఇన్‌చార్జి ప్రొద్దుటూరి నాగేశ్వరరావు, ఆర్య వైశ్య పట్టణ అధ్యక్షులు నరేంద్రుల అనుబాబు తదితరులు పాల్గొన్నారు.



ధికారులు, సభ్యులతో పాటు ఇల్లందు ఆర్య వైశ్యులకు నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.









కార్మిక శాఖలో కోల్డ్ వార్..

మంత్రి వర్సెస్ సెక్రటరీ!

కార్మిక శాఖలో మంత్రి, సెక్రెటరీ మధ్య కొరవడిన సమన్వయం

- **ఒకరి ఆదేశాలను మరొకరు పట్టించుకోవడం లేదన్న విమర్శలు**
- **బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డులో అక్రమాల ఆరోపణలు**
- **బినామీ దరఖాస్తులతో ఎక్స్‌గ్రేషియా నిధులు స్వాహా?**
- **ధ్రువపత్రాలు లేకుండానే క్లెయిమ్స్‌కు అనుమతులు?**
- **అక్రమాలపై విచారణకు మంత్రి ఆదేశాలు**
- **విజిలెన్స్ విచారణ పరిధిపై సెక్రెటరీ జోక్యం?**
- **రాష్ట్రవ్యాప్త విచారణను జిల్లా పరిధికే పరిమితం చేశారన్న ప్రచారం**
- **విచారణ పరిధిపై రెండుసార్లు సవరించిన జీవోలు?**

భద్రాద్రి న్యూస్ స్పెషల్ ఫోకస్

మంత్రి, సెక్రెటరీ మధ్య సమన్వయం ఉంటేనే సంబంధిత శాఖల్లో పనితీరు మెరుగ్గా ఉంటుంది. సమస్యలు సైతం వెంటనే పరిష్కారం అవుతాయి. కానీ కార్మిక శాఖలో మాత్రం అందుకు విరుద్ధమైన పరిస్థితులు ఉన్నట్లు సెక్రెటేరియట్ వర్గాల్లో ప్రచారం జరుగుతున్నది. ఆ శాఖ మంత్రి , సెక్రెటరీ మధ్య విబేధాలు కొనసాగుతున్నట్లు విమర్శలు ఉన్నాయి. మంత్రి ఇచ్చిన ఆదేశాలను సెక్రెటరీ పెడచెవిన పెడుతుండగా, సెక్రెటరీ ఇచ్చిన సలహాలను మంత్రి పట్టించుకోవట్లేదని ఫిర్యాదులు ఉన్నాయి. దీంతో ఆ శాఖకు చెందిన మెజార్టీ నిర్ణయాలు వివాదాస్పదంగా మారుతున్నట్లు తెలుస్తున్నది.

మంత్రి ఇలాకాలో ఎక్కువ అవినీతి?

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం కార్మికశాఖ పరిధిలోని తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కనస్ట్రక్షన్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు (TBOCWWB) పనిచేస్తుంటుంది. ప్రమాదానికి గురైన కార్మికులకు, మరణించిన కుటుంబాలకు, కార్మికుల పిల్లల పెళ్లిలకు ఆర్థిక సాయం అందిస్తుంటుంది. కొన్ని నెలలుగా ఈ సంస్థలో పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. కొందరు రాజకీయ నాయకులు, బోర్డులో పనిచేస్తోన్న అధికారులు కుమ్మక్కై బినామీ పేర్లతో దరఖాస్తులు సమర్పించి ఎక్స్‌గ్రేషియా నిధులను జేబుల్లో వేసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. కొన్ని కేసుల్లో లబ్దిదారులకు సంబంధించిన సర్టిఫికేట్స్ లేకుండానే కేవలం తెల్ల కాగితంపై రాసిచ్చిన దరఖాస్తులను మీ సేవల్లో అప్‌లోడ్ చేసి పెద్దఎత్తున బీమా మొత్తాలను సొంతం చేసుకున్నట్లు సమాచారం. ఈ విషయంపై రాజకీయ దుమారం రేగడంతో రాష్ట్రవ్యాప్తంగా చెల్లించిన క్లెయిమ్స్‌పై విచారణ చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలంటూ మంత్రి ఆదేశించారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా విచారణ చేయాలంటూ విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్‌కు బాధ్యతలు అప్పగించే సమయంలో కార్మిక శాఖ సెక్రెటరీ జోక్యం చేసుకున్నట్లు విమర్శలున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా విచారణ అవసరం లేదని, కేవలం మంత్రి సొంత జిల్లాలో మాత్రమే విచారణ జరిపిస్తే సరిపోతుందంటూ జీవో జారీ చేసినట్లు సెక్రెటేరియట్ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. దీనితో విచారణ పరిధి విషయంలో ఇప్పటివరకు 2 సార్లు జీవోను సవరించినట్లు తెలిసింది. మంత్రి సొంత జిల్లా పరిధిలోనే ఎక్కువ అక్రమాలు జరిగినందువల్లే విచారణ పరిధిని కుదించారనే చర్చ సెక్రెటేరియట్ వర్గాల్లో జరుగుతున్నది. రాష్ట్రవ్యాప్తంగా విచారణ జరిపిస్తే అధికారుల అవినీతి బట్టబయలు అవుతుందని భయంతోనే విచారణ పరిధిని తగ్గించారేమోనని అనుమానాలు కలుగుతున్నాయి.

మంత్రి నో.. సెక్రెటరీ ఎస్

కార్మికశాఖ కమిషనరేట్‌లో అడిషనల్ కమిషనర్‌గా ఉన్న అధికారి వెల్ఫేర్ బోర్డు సీఈవోగా బాధ్యతలు నిర్వహించారు. ఆయన తీరు వల్లే బోర్డులో ఉన్న నిధులు దుర్వినియోగం అవుతున్నట్లు పెద్ద ఎత్తున ఆరోపణలు రావడంతో ఆయనను ఆ పోస్టు నుంచి తప్పించేందుకు మంత్రి తీవ్రంగా శ్రమించినట్లు ప్రచారం ఉంది. ఎందుకంటే సదరు అధికారికి సపోర్టుగా సెక్రెటరీ నిలిచారని, అందుకే మంత్రి ఆదేశాలను అమలు చేయడానికి ఆలస్యం జరిగిందని చర్చ కార్మికశాఖ వర్గాల్లో ఉంది. బోర్డు పరిధిలోని క్లెయిమ్స్ విషయంలో ఆ అధికారి పాత్ర ఉండటంతోనే నిధుల దుర్వినియోగం జరిగినట్లు నిర్ణయానికి వచ్చిన మంత్రి అతడిని ఆ పోస్టు తప్పించాలంటూ సెక్రెటరీని పలుసార్లు ఆదేశించినట్లు తెలిసింది. కానీ ఆమె మాత్రం సీఈవో సమర్థవంతంగా పనిచేస్తున్నారని, అవినీతి ఆరోపణల్లో అతని పాత్ర లేదని నిర్ణయానికి వచ్చి, అదే స్థానంలో కొనసాగించేందుకు మొగ్గుచూపినట్లు తెలిసింది. దీంతో విసిగిపోయిన మంత్రి సెక్రెటరీపై సీఎంఓ అధికారులకు ఫిర్యాదు చేయగా అప్పుడు ఆ ఆఫీసర్ బోర్డు సీఈవో పోస్టు తప్పించినట్లు తెలిసింది.

IMS డైరెక్టర్ పోస్టుపై చెరో మాట

ఈఎస్ఐ ఆసుపత్రులు కార్మికశాఖలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సర్వీసు సంస్థ పరిధిలోకి వస్తాయి. ఆ సంస్థ కార్యకలాపాలను ఆ శాఖ సెక్రెటరీనే పర్యవేక్షణ చేస్తున్నారు. ఆ సంస్థకు డైరెక్టర్‌గా ఐఏఎస్ హోదాలోని ఆఫీసర్‌కు కాకుండా డాక్టర్‌కు అప్పగించాలంటూ మంత్రి కొన్ని నెలలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో సంస్థ పనితీరు మెరుగుపడుతుందని భావించి, ప్రభుత్వానికి ఆ మేరకు ప్రపోజల్ పెట్టాలంటూ సెక్రెటరీని ఆదేశించినట్లు తెలిసింది. కానీ డాక్టర్లకు డైరెక్టరేట్ బాధ్యతలు అప్పగించినప్పుడు పెద్ద ఎత్తున అవినీతి చోటుచేసుకున్న ఉదంతాలు ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నాయని, అందుకని ఐఏఎస్‌లే ఆ పోస్టులో కొనసాగాలంటూ సెక్రెటరీ వాదించినట్లు తెలిసింది. దీంతో మంత్రి ప్రపోజల్‌ను సీఎంఓకు పంపకుండా పక్కన పెట్టినట్లు ప్రచారం జరుగుతున్నది.

మంత్రి సంతకం లేకుండానే ప్రపోజల్స్

ఏదైనా అంశంపై నిర్ణయం తీసుకోవాలంటే మంత్రి సంతకంతో కూడిన ప్రపోజల్స్ సెక్రెటరీకి వస్తే వాటిని అధికారికంగా పరిగణిస్తుంటారు. కానీ మంత్రి సంతకం లేకుండానే కేవలం లెటర్ హెడ్‌పై పలానా పని చేయాలంటూ సెక్రెటరీకి ప్రపోజల్స్ వస్తున్నట్లు తెలిసింది. దీంతో వాటిని సెక్రెటరీ పెండింగ్‌లో పెడుతున్నట్లు సమాచారం. మంత్రి ఆదేశాల మేరకే ఆయన పేషీ నుంచి ప్రపోజల్స్ పంపుతున్నారా? లేక ఆయనకు తెలియకుండానే వస్తున్నాయా? అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. ప్రధానంగా గతంలో ఈఎస్ఐ కొనుగోళ్లలో జరిగిన అక్రమాల కేసులో ఇరుక్కున్న ఓ ఆఫీసరును కేసు నుంచి బయటకు రప్పించాలంటూ పలుమార్లు సెక్రెటరీకి మంత్రి సంతకం లేకుండానే ప్రపోజల్స్ వచ్చినట్లు ప్రచారం ఉంది.

కొత్త సెక్రెటరీ కోసం మంత్రి అన్వేషణ

సెక్రెటరీ తీరుతో విసిగిపోయిన మంత్రి.. ఆమెను అక్కడి నుంచి తప్పించాలంటూ సీఎంఓ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. తనకు సహకరించే అధికారి కోసం ఆయన ఆన్వేషణ చేసి, కొన్ని పేర్లను సీఎంఓకు పంపినట్లు సమాచారం. మంత్రి తీరుతో చికాకు పడుతోన్న సెక్రెటరీ సైతం ఆ శాఖ నుంచి బయట పడేందుకు ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం జరుగుతున్నది. అందులో భాగంగానే ఆమె కేంద్ర సర్వీసులోకి వెళ్లేందుకు డిప్యూటేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నట్లు టాక్ ఉంది.